క్లుప్తంగా

'శిథిలావస్థ నివాస గృహాల్లో ఉండొద్దు'



చెన్నూర్‌లో పర్యటిస్తున్న కమిషనర్, కౌన్సిలర్లు

చెన్నూర్: భారీ వర్షాల కారణంగా శిథిలావస్థకు చేరిన నివాస గృహాల్లో ప్రజలు ఉండొద్దని, బంధువుల ఇళ్లకు వెళ్లాలని మున్సిపల్ కమిషనర్ గంగాధర్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరానగర్, దుబ్బాబూడెం, బేతాళవాడ, కొటంవాడలోని లోతట్టు ప్రాంతాల్లో శుక్రవారం కౌన్సిలర్లు రెవెల్లి మహేశ్, నసీమాబేగంలతో కలిసి పర్యటించారు. రోడ్లపై నిలిచిన వర్షపునీటిని మురికి కాలువల్లోకి మళ్లించారు. చెత్తతో మూసుకుపోయిన డ్రెయినేజీలను శుభ్రం చేయించారు. రానున్న మూడు రోజుల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు ఉండడంతో, ప్రజలు అవసరమైతే తప్పా రాత్రి వేళల్లో బయటికి రావొద్దన్నారు. ఎలాంటి ప్రమాదాలు జరిగినా మున్సిపాలిటీ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది రాజ్‌కుమార్, సాయి, మధు పాల్గొన్నారు.

లక్సెట్టిపేట సీఐగా కృష్ణ



లక్సెట్టిపేట: లక్సెట్టిపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఆర్.కృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు సీఐగా పని చేసిన కృష్ణారెడ్డి సిద్దిపేట వన్ టౌన్‌కు బదిలీ కావడంతో రామగుండం కమిషనరేట్‌లో టాస్క్‌ఫోర్స్ విభాగంలో పని చేసిన కృష్ణను లక్సెట్టిపేటకు బదిలీ చేశారు. లక్సెట్టిపేట, దండేపల్లి, జన్నారం ఎస్సైలు లక్ష్మణ్, ప్రసాద్, సతీశ్ పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

ట్రేడ్‌లైసెన్స్ తీసుకోవాలి

బెల్లంపల్లి: మున్సిపాలిటీలోని ప్రతి షాపు యజమాని విధిగా ట్రేడ్‌లైసెన్స్ తీసుకోవాలని బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య సూచించారు. షాపులను శుక్రవారం కమిషనర్ సందర్శించారు. ఈ సందర్భంగా ట్రేడ్‌లైసెన్స్ తీసుకోవాలని పేర్కొన్నారు. షాపుల ముందు చెత్త డబ్బాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్స్ ఉదయ్ కిరణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీల్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏజెన్సీల దోపిడీని అరికట్టాలి

చెన్నూర్: వైద్య ఆరోగ్య శాఖలోని వివిధ విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ఏజెన్సీలు దోచుకుంటున్నాయని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నాయకుడు ఇరికిల్ల మల్లేశ్ ఆరోపించారు. ఏజెన్సీల దోపిడీని అరికట్టాలని కోరుతూ శుక్రవారం ఎల్లక్కపేట సామాజిక ఆరోగ్య కేంద్ర సూపరింటెండెంట్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు శ్రీనివాస్, విజయ్, కౌసల్య, సుచరిత, స్వరూపారాణి, తిరుపతి, రాజేందర్ పాల్గొన్నారు.

ఆదివాసీల నిరసన

కాసిపేట: మణిపూర్ రాష్ట్రంలో ఆదివాసీ మహిళలను నగ్నంగా ఊరేగించి, గ్యాంగ్‌రేప్, హత్య చేసిన ఘటనను నిరసిస్తూ శుక్రవారం మండలంలోని కొండపూర్‌యాప కొమురం భీం విగ్రహం వద్ద తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఆదివాసీలు నిరసన తెలిపారు. జాతీయ ఎస్టీ కమిషన్ స్పందించి వెంటనే దోషులను ఉరితీయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి ఆడ జంగు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పెంద్రం హన్మంతు, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు వెడ్మా కిషన్, కొమ్ముల రాంచందర్, సిడం గణపతి, కుర్సింగ తిరుపతి, సెడ్మాక రాధ, మోతీరాం, తదితరులున్నారు.

డీఈవోకు వినతి

మంచిర్యాలఅర్బన్: అక్రమ డిప్యూటేషన్లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో డీఈవో యాదయ్యను కలిసి విన్నవించారు. పక్కా మండలాలకు చెందిన ఉపాధ్యాయులను సర్దుబాటు చేయకుండా, నిబంధనలకు విరుద్ధంగా దూరంగా ఉన్న మండలాల నుంచి ఉపాధ్యాయులను వర్క్ అడ్జస్ట్‌మెంట్ చేయడాన్ని జిల్లా అధ్యక్షుడు గోళ్ల రామన్న, ప్రధాన కార్యదర్శి రాజావేణు తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి భూక్యా కిరణ్, జిల్లా కార్యదర్శి వేల్పుల కిరణ్‌కుమార్, లక్సెట్టిపేట మండల అధ్యక్షుడు బండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వాన.. వరద..!



రాకపోకలు నిలిపివేస్తున్న పోలీసులు

ఉప్పొంగిన ఎర్రవాగు

నెన్నెల: మండల కేంద్రంలోని లంబాడి తండా ఎర్రవాగు ఉప్పొంగి కాజ్‌వే పై నుంచి ప్రవహించింది. నెన్నెల ఎస్సై శ్యాం పటేల్ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. బారికేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలను నిలిపివేశారు. లంబాడితండా, మన్నెగూడం, జంగాల్‌పేట, కోనంపేట, కుర్మగూడం చిన్న, పెద్ద లంబాడితండా, పాటి, దమ్మిరెడ్డిపేట, బోగంపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. తహసీల్దార్ భూమేశ్వర్, ఆర్ఐ గణేష్ ఎర్రవాగును సందర్శించారు. కాపువాడలో తోట తిరుపతికి చెందిన ఇల్లు కూలింది. తృటిలో ప్రమాదం తప్పింది. ఎస్సై శ్యాం పటేల్, తహసీల్దార్ భూమేశ్వర్, ఆర్ఐ గణేశ్ అక్కడికి చేరుకొని వారిని మరో ఇంటికి తరలించారు.



కూలిన ఇల్లు వద్ద బాధితులు



కోటపల్లి: నక్కలపల్లి వద్ద తెగిన తాత్కాలిక వంతెన

> జిల్లా వ్యాప్తంగా మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జనజీవనం స్తంభించింది. వాగులు ఉప్పొంగాయి. రోడ్లు జలమయమయ్యాయి. పలుచోట్ల శిథిలావస్థకు చేరిన ఇళ్లు నేలమట్టమయ్యాయి. వర్షాల కారణంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రెవెన్యూ, పోలీసు అధికారులు లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి తగు చర్యలు తీసుకున్నారు.



జన్నారంలో లోత్తొర్రె వాగు

జన్నారం: మండలంలోని పొనకల్ గ్రామంలోని సాయిబాబ ఆలయం ఎదుట, సినిమా హాలుకు వెళ్లే దారిలో వరదనీరు నిలిచి రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. కలమడుగు, పొనకల్, మహ్మదబాద్ వాగులు ఉప్పొంగాయి. శ్రీలంక కాలనీ చుట్టూ నీరు చేరింది. ఇప్పటి వరకు మండలంలో ఎలాంటి నష్టం వాటిల్లలేదని అధికారులు తెలిపారు. లోత్తొర్రే వాగు ఉప్పొంగడంతో గ్రామ పంచాయతీకి ఇతర గ్రామాలతో సంబంధాలు తెగిపోయాయి. మూడు రోజులుగా వంట సరుకులు లేక, ఇతర గ్రామాలకు వెళ్లలేక అవస్థలు సమీప గ్రామాల ప్రజలు అవస్థలు పడ్డారు.



తిమ్మాపూర్‌లో వాగు ఉధృతి



పరవళ్లు తొక్కిన గోదావరి

దండేపల్లి: కడెం ప్రాజెక్టు వరద గేట్లు ఎత్తడంతో, దండేపల్లి మండలంలోని ద్వారక, గూడెం వద్ద గోదావరి నది శుక్రవారం పరవళ్లు తొక్కుతూ ప్రవహించింది. ద్వారక వద్ద గోదావరి పరవళ్ల ను స్థానికులు తిలకించారు. పలుచోట్ల పత్తి చేలల్లో వర్షం నీళ్లు నిలిచాయి. చేలల్లో నిలిచిన నీళ్లు తొలగించేందుకు రైతులు అవస్థలు పడ్డారు.

పొంగిన కత్తెరసాల వాగు

చెన్నూర్‌రూరల్: మండలంలోని కత్తెరసాల, నారాయణపూర్, రాయిపేట, సుద్దాల, బుద్దారం, సంకారం గ్రామాల సమీపాల్లోని వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. అక్కెపల్లికి వెళ్లే దారిలోని వాగు ఉప్పొంగడంతో కాజ్‌వే పై నుంచి నీరు ప్రవహిస్తోంది. పంట చేలల్లో వర్షపు నీరు నిలిచింది.





లోత్తొర్రె, గొల్లగట్టు వాగులు..

కోటపల్లి: మండలంలోని లోత్తొర్రె వాగు, గొల్లగట్టు వాగులు ఉప్పొంగి ప్రవహించాయి. లింగన్నపేట, ఎదులబంధం, సిర్సా, పుల్లగామ, రొయ్యలపల్లి, ఆలుగామ, జనగామ, వెంచపల్లి గ్రామాల ప్రజలకు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గొల్లగట్టు వాగు వద్ద తాత్కాలికంగా ఏర్పాటు చేసిన వంతెన తెగిపోవడంతో రాకపోకలు నిలిచాయి.

ఉధృతంగా 'ప్రాణహిత'

వేమనపల్లి: మండలంలోని చామనపల్లి పెద్దవాగు, మత్తడివాగు, వరద నీటితో పొంగి ప్రవహించాయి. రాచర్ల బొందచేను ఒర్రే వరకు ప్రాణహిత నీరు, వరద నీరు మోహరించడంతో అసంపూర్తిగా ఉన్న వంతెనల వద్ద రాకపోకలు నిలిచాయి. ప్రాణహిత నది వరద ఉధృతి శుక్రవారం సాయంత్రం పెరుగుతున్నట్లు జాలర్లు తెలిపారు. మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దు రాకపోకలు నిలిచిపోయాయి.



బొందచేను వంతెన వద్ద ప్రాణహిత నీరు



నిండుగా రాంనగర్ వాగు..

బెల్లంపల్లి: బల్దియాలో మురుగు నీటి కాలువలు నిండుగా ప్రవహించగా, ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షానికి రాంనగర్ వాగు పరవళ్లు తొక్కింది. బ్రిడ్జి పై భాగం వరకు వరద నీరు ప్రమాదకరస్థితిలో ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది.

లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోశ్

జైపూర్: వర్షంతో నెలకొన్న పరిస్థితులపై జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌తో కలిసి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మండలంలోని ఆయా ప్రాంతాలను సందర్శించారు. పెగడపల్లి ఈదులాగు, టేకుమట్ల పెద్దవాగు ఉప్పొంగి ప్రవహించడంతో సుమారు 10గ్రామాలకు పైగా రాకపోకలు నిలిచిపోయాయి. వాగులను సందర్శించి లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల సహాయార్థం సమీకృత కలెక్టరేట్ భవనంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జైపూర్ మండల వ్యాప్తంగా 54.8మిల్లి మీటర్ల వర్షం కురిసింది. ఎల్లంపల్లి గేట్లు ఎత్తడంతో వేలాల పురష్కరఘాట్ నీట మునిగింది. ఇందారం ఐకే1ఏ గని, ఐకే–ఓసీపీపై గోదావరి నీటి ప్రవాహం మూలంగా, బొగ్గు ఉత్పత్తికి ఎలాంటి ఆటంకం కలగకుండా ఉండేందుకు చేపట్టాల్సిన చర్యలపై శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి పరిశీలించి పలు సూచనలు చేశారు. పెగడపల్లి ఈదులాగు, టేకుమట్ల పెద్దవాగు వంతె వద్ద పరిస్థితిని శ్రీరాంపూర్ సీఐ రమేశ్, ఎస్సై ఉపేందర్‌రావు, తహసీల్దార్ మోహన్‌రెడ్డి పర్యవేక్షించారు.



టేకుమట్ల వాగు వద్ద పరిస్థితిని పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్, అదనపు కలెక్టర్ రాహుల్

ఎంసీహెచ్ తరలింపుపై రాజకీయం

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి వరద ముప్పు పొంచి ఉండడం తెలుసుకుని శుక్రవారం ఉదయమే కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు ఎంసీహెచ్‌కు చేరుకున్నారు. బాలింతలు, గర్భిణులను తరలించేందుకు సాయం చేసేందుకు కాంగ్రెస్ నాయకులు వచ్చారని తెలుసుకున్న, బీఆర్ఎస్ నాయకులు సైతం ఎంసీహెచ్‌కు చేరుకున్నారు. బాలింతల తరలింపు కోసం కాంగ్రెస్ నేతలు ఆటోలను మాట్లాడి, అందులో తరలిస్తుండగా, బీఆర్ఎస్ నాయకులతో వాగ్వాదం మొదలైంది. దీంతో గంటసేపు ఎంసీహెచ్ ఎదుట ఇరువర్గాల నాయకులు గొడవకు దిగడంతో పట్టణ సీఐ రాజు, ఎస్సై రాజేందర్ ఇరువర్గాలను అక్కడి నుంచి పంపించి వేయడంతో, వివాదం సద్దుమణిగింది. కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ప్రజలు కోరుకున్న చోట ఎంసీహెచ్‌ను నిర్మించకుండా, వారికి నచ్చిన చోట నిర్మించడం వల్లనే ఈ ఇబ్బందులు ఉన్నాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కావాలనే ఎంసీహెచ్ తరలింపును రాజకీయం చేస్తున్నారని, ఎమ్మెల్యే వల్లనే అభివృద్ధి జరుగుతుండడంతోనే కావాలనే విమర్శలు, ఆరోపణలు చేస్తున్నారని అన్నారు.



ఎంసీహెచ్ ఎదుట బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల వాగ్వాదం

పాతమంచిర్యాల: మాతాశిశు ఆరోగ్య కేంద్రాన్ని పట్టణంలో నిర్మించాలని బీసీ సంక్షేమసంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ నీలకంఠేశ్వర్‌రావు అన్నారు. గోదావరి రోడ్డులో నిర్మించిన మాతాశిశుఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు.

చేపలకు భలే గిరాకీ

మంచిర్యాలటౌన్: వాగులు, కాలువల ద్వారా వరద నీరు వచ్చి గోదావరి నదిలోకి చేరుతోంది. దీంతో మత్స్యకారులు జిల్లా కేంద్రంలోని గోదావరి నది వద్ద వలలతో చేపలు పట్టి రూ.150చొప్పున అమ్ముతుండడంతో పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున కొనుగోలు చేశారు.



సమాచారం

దరఖాస్తు చేసుకోండి

బెల్లంపల్లి: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రికల్, మైనింగ్, ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్ కోర్సుల్లో ప్రథమ సంవత్సరంలో సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 25–27వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పాలిసెట్–2023 అర్హత సాధించిన విద్యార్థులతో పాటు పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు 28న ఉదయం 10గంటలకు కళాశాలలో జరిగే స్పాట్ అడ్మిషన్ ప్రక్రియకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

అతిథి అధ్యాపకుల పోస్టులకు...

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు. ఇంగ్లిష్ బోధించేందుకు రెండు పోస్టులు, తెలుగు ఒకటి, కామర్స్ ఒకటి, కంప్యూటర్ సైన్స్ బోధించేందుకు రెండు పోస్టులు ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీ పూర్తి చేసిన అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులలో పీజీలో కనీసం 55శాతంతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. అభ్యర్థులు బయోడేటా, ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, పీజీ, కాన్‌వోకేషన్, క్యాస్ట్ సర్టిఫికెట్ల జిరాక్స్‌లను సోమవారం కళాశాలలో అందించాలని పేర్కొన్నారు. మంగళవారం త్రిసభ్య కమిటీ ద్వారా ఇంటర్వ్యూ, డెమో ఆధారంగా నియామకం చేపట్టనున్నట్లు తెలిపారు.

పండ్ల తోటల పెంపకానికి...

జైపూర్/వేమనపల్లి: పండ్ల తోటల పెంపకం కోసం రైతులు జులై 31లోగా దరఖాస్తు చేసుకోవాలని వేమనపల్లి ఏఈఓ సంతోష్‌కుమార్, జైపూర్‌లో ప్రజాప్రతినిధులు, అధికారులు తెలిపారు. ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సాహం, సబ్సిడీలపై వివరించారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జైపూర్‌లో ఎంపీపీ రమాదేవి, ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో అనిల్‌కుమార్, ఏపీవో బాలయ్య, వ్యవసాయశాఖ అధికారులు, పాల్గొనగా, వేమనపల్లిలో పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ, ఎపీఏ రాజలింగు, రైతులు పాల్గొన్నారు.

కళాకారుల సమస్యలు పరిష్కరించాలి

శ్రీరాంపూర్: సింగరేణిలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కళాకారుల సమస్యలను పరిష్కరించాలని సింగరేణి కళాకారుల ఐక్యవేదిక అధ్యక్షుడు ఎస్కే తాజుద్దీన్ కోరారు. ఈ మేరకు శుక్రవారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో ఏజెంట్ గోపాల్‌సింగ్‌ను వేదిక సభ్యులు కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు మేడ పెద్దయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి సదానందం, సహాయ కార్యదర్శి అంతడుపుల సతీష్, సంయుక్త కార్యదర్శులు కిరణ్ సందేశ్, కార్యవర్గ సభ్యులు సురేందర్, హరీష్, వంశీ, ఇతర కళాకారులు పాల్గొన్నారు.



ఏజెంట్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న కళాకారులు

ఏసీపీని కలిసిన జీఎం



శ్రీరాంపూర్: కొత్తగా జైపూర్ ఏసీపీగా వచ్చిన బీ.మోహన్‌ను శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. శ్రీరాంపూర్ ఏరియా ముఖచిత్రంను వివరించారు. కార్యక్రమంలో సీనియర్ సెక్యూరిటీ అధికారి మురళీమోహన్ పాల్గొన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

బేసిక్ ఫిక్సేషన్‌పై ఆడిట్

శ్రీరాంపూర్: ఉద్యోగుల(ఎన్సీడబ్ల్యూఏ) 11వ వేతన ఒప్పందంకు సంబంధించిన కొత్త వేతనాలపై బేసిక్ ఫిక్సేషన్ ఆడిట్ చేశారు. శ్రీరాంపూర్‌లోని ఆడిట్ కార్యాలయంలో శుక్రవారం ఫైనాన్స్ మేనేజర్ నాగలక్ష్మి, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మోహన్‌బాబు సమక్షంలో ఈ ఆడిట్ నిర్వహించారు. రీజియన్ పరిధిలోని మూడు ఏరియాల నుంచి క్లర్క్‌లు ఇక్కడికి వచ్చి ఆడిట్‌లో పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కోటపల్లి: వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అశోక్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టిన అనంతరం రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్ తిరుపతికి వినతిపత్రం అందజేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకొని వ్యవసాయ కూలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు మార య్య, నగేశ్, పద్మ, సులోచన, రాజన్న, స్వప్న, లక్ష్మి పాల్గొన్నారు.

యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడిగా శ్రావణ్

బెల్లంపల్లి: బెల్లంపల్లి యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడిగా బోగ శ్రావణ్ నియామకం అయ్యాడు. పట్టణ కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో శ్రావణ్‌కు అసెంబ్లీ నియోజకవర్గ యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు ముడిమడుగుల మహేందర్ నియామక పత్రం అందజేశారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

రామకృష్ణాపూర్: మందమర్రి పట్టణానికి చెందిన పలువురు యువకులు శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ చెన్నూర్ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ రాజరమేష్ ఆధ్వర్యంలో గద్దెరాగిడిలో పార్టీలో చేరగా వారికి కండువా కప్పి ఆహ్వానించారు.

వరద ప్రాంతాల సందర్శన

జైపూర్: మండల వ్యాప్తంగా గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు కురిసిన వరద ప్రాంతాలను కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ రాజారమేశ్ సందర్శించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

అర్హులైన వారికి డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇవ్వాలి

మందమర్రిరూరల్: పట్టణంలో సొంత ఇల్లు లేక ఎంతో మంది నిరుపేదలు అల్లాడుతున్నారని, అర్హులైన వారికి ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇవ్వాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు నరేష్ డిమాండ్ చేశారు.

ఈవీఎంలపై అవగాహన

బెల్లంపల్లి/మంచిర్యాలటౌన్/భీమారం: వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఎన్నికల సంఘం ఆదేశాలతో శుక్రవారం ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన కల్పించారు. పోలింగ్‌లో ఈవీఎంలు పని చేసే తీరును వివరించారు. ఈవీఎంలను ఉపయోగించడం సురక్షితమని, ప్రతి ఓటరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మంచిర్యాలలో తహసీల్దార్ రాజేశ్వర్, సీనియర్ అసిస్టెంట్ గడియారం శ్రీహరి, భీమారంలో ఎన్నికల అధికారి సుమన్‌కుమార్ బెల్లంపల్లిలో తహసీల్ కార్యాలయం ఉద్యోగులు, ఓటర్లు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

భీమిని: మండలంలోని శికినం గ్రామంలో చిన్నపాటి వర్షానికి రోడ్లు బురదమయమవుతున్నాయని, తమకు రోడ్డు సౌకర్యం కల్పించాలంటూ గురువారం కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేయగా శుక్రవారం ఎంపీఓ సతీష్ గ్రామాన్ని సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

నిరసన

బెల్లంపల్లి: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దాగం శ్రీకాంత్ విమర్శించారు. మణిపూర్‌లో ఇద్దరు గిరిజన మహిళలపై జరిగిన అవమానాన్ని నిరసిస్తూ శుక్రవారం నిరసన తెలిపారు.

సంక్షిప్త వార్తలు

సమస్యలు పరిష్కరించాలి

జన్నారం: మండలంలోని సమస్యలను పరిష్కరించాలని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌ను తెలంగాణ జీపీసీ జిల్లా ప్రధానకార్యదర్శి కత్తెరపాక రాజేశ్ కోరారు. సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని ఆయన తెలిపినట్లు రాజేశ్ తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మంచిర్యాలటౌన్: భారీ వర్షాల కారణంగా గోదావరి నదికి పెరుగుతున్న వరద ఉధృతికి గోదావరి పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంచిర్యాల మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య అన్నారు. మున్సిపల్ కమిషనర్, అధికారులతో కలిసి పరిశీలించారు.

తాండూర్: ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాదారం ఎస్సై రాజశేఖర్ గ్రామీణులకు సూచించారు. నర్సాపూర్ గిరిజన గ్రామానికి వెళ్లి వరదల బారిన పడకుండా శుక్రవారం అవగాహన కల్పించారు.

'ఎమ్మెల్యే హామీలు నీటిమూటలేనా'

నెన్నెల: ఎర్రవాగుపై రూ.2కోట్లతో బ్రిడ్జి నిర్మిస్తామని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఇచ్చిన హామీలు నీటి మూటలేనా అని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, గుండ్లసోమారం ఎంపీటీసీ దాగం రమేష్ ప్రశ్నించారు. ఉప్పొంగిన ఎర్రవాగును కాంగ్రెస్ నాయకులు శుక్రవారం సందర్శించారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని ఉద్యమం

మంచిర్యాలఅర్బన్: ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించేంత వరకు ఉద్యమిస్తామని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయసంఘం (తపస్) జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు తెలిపారు. బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం సమస్యల పరిష్కారం కోరుతూ ఉద్యమ కరపత్రాలు, పోస్టర్లు ఆవిష్కరించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మంచిర్యాల:
9010299065, 9951602823
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల : సల్మాన్‌ఖాన్ - 7995855506
చెన్నూర్ : క్రిష్ణ - 8309865990
బెల్లంపల్లి : సంపత్ - 7036227114
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899